క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం జ్యోతిర్మయి విద్యాసంస్థల అధినేత మురళీబాబు, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఎం.రాజేంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసే ఏకైక విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు గౌస్, నాగరాజు, గణేష్, రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



పారాయణం చేస్తున్న మహిళలు



అలంకరణలో స్వామి,అమ్మవార్లు

ఆదోని అర్బన్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీజనార్ధనస్వామికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి సంఘం ఆధ్వర్యంలో వేకువజామునే మహిళలు పిండి వంటలు చేసి స్వామివార్లకు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం లక్ష్మీజనార్ధనస్వామి, వాసవీమాత, నగరేశ్వరస్వామి వార్లకు అభిషేకం, అష్టోత్తరం, విశేష పూజలు నిర్వహించారు. సామూహికంగా తిరుప్పావై, గోవింద నామాలతో పారాయణం చేశారు.

సంక్రాంతి సంబరం




ఆదోని అర్బన్: పట్టణంలోని వాగ్దేవి పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో జరిగిన ఈకార్యక్రమంలో దాదాపు వంద మంది దాకా మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఉపాధ్యాయురాలు రేణుకా అందజేశారు.

భవన నిర్మాణాల పరిశీలన

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని రచ్చుమర్రి, మాలపల్లి, పరమాన్‌దొడ్డి, కాచాపురం గ్రామాల్లో తహసీల్దార్ చంద్రశేఖర్, పీఆర్ డీఈ అశ్వథామ పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణలను వారు పరిశీలించారు. మరి కొన్ని చోట్ల కొత్త భవనాల నిర్మాణాలకు స్థలాలు చూశారు. కాచాపురం, పరమాన్‌దొడ్డి తండా గ్రామాల్లో ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం అవసరముందన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ నరసింహులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జాలిమంచి రోడ్డును బాగు చేయండి



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్ వద్ద మాధవరం రోడ్డు నుంచి జాలిమంచి గ్రామానికి వెళ్లే రహదారిని బాగు చేయాలని సీపీఎం ఆదోని మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. బుధవారం ఆయన స్థానికులతో కలిసి దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు గుంతమయంగా మారిందన్నారు. ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగాయని, దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని కోరారు.

నేడు సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాలు

కర్నూలు కల్చరల్: సరస్వతీ విద్యా పీఠం స్వర్ణోత్సవాలను గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కర్నూలు నగర శివారులోని కమ్మయడ్లపల్లి పుల్లారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సరస్వతి విద్యా పీఠం జిల్లా అధ్యక్షుడు బి.వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని శిశు మందిరాల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 5 వేలు, పూర్వాచార్యులు వెయ్యి మొత్తం 6 వేల మంది ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

సంక్షేమ పాలనతో ప్రజల్లో సుస్థిర స్థానం

- మూడున్నరేళ్ల వైఎస్ జగన్ పాలనపై ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి
- రౌడూరులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

మంత్రాలయం/కౌతాళం: సంక్షేమ పాలనతో పేదల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం రెండో రోజు మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్‌కుమార్ రెడ్డితో కలిసి 330 ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న పథకాల్ని వివరించారు. ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందజేయడంలో జగనన్న సక్సెస్ అయ్యారని పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు మంచి ఆత్మీయత లభిస్తోందన్నారు. జగనన్న చలువతోనే ఎమ్మెల్యేలు గడప గడప కార్యక్రమంలో గౌరవ మర్యాదలు పొందుతున్నారని వ్యక్తం చేశారు. రౌడూరు గ్రామంలో ఏడాదిలో రూ.6 కోట్ల వరకు సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరా యని తెలిపారు. గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు కొత్తగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లుతోపాటు ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. జల్ జీవన్ మిషన్‌తో ఇప్పటికే మండలానికి రూ.6.97 కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో దాదాపు రూ.70 కోట్లతో ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన పనులు శూన్యమన్నారు. నీరు–చెట్టు కార్యక్రమంలో టీడీపీ నాయకులు దోచుకోవడం దాచుకోవడం చేశారని ఆరోపించారు. జన్మభూమి కమిటీల ద్వారా పింఛన్ల మంజూరులో పేదలకు ఎంతో అన్యాయం చేశారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలన్నీ పచ్చచొక్కాల పాలు చేసుకోవడం చవిచూశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రి తనయ గౌడ్, సర్పంచు సుశీల, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుసుమ, నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సరెడ్డి, సోమిరెడ్డి, ఏకాంబరరెడ్డి, శేషరావు, గురునాథ్‌రెడ్డి, అనిల్, వైస్ ఎంపీపీలు బుజ్జిస్వామి, లిఖితరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ఉర్దూ పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా

కౌతాళం: కౌతాళంలోని ఉర్దూ పాఠశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఉర్దూ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని, అలాగే స్కూల్ రోడ్డు సరిగ్గా లేదని పాఠశాల విద్యా కమిటి చైర్మన్ షేక్షావలి, ప్రధానోపాధ్యాయుడు లతీఫ్‌ఉద్దీన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఎంఈఓ ఆంజినేయులతో ఫోన్‌లో మాట్లాడారు. ఉర్దూ పాఠశాలకు అదనపు గదులతో పాటు కాంపౌండ్‌వాల్ నిర్మించడానికి నాడు–నేడు కింద ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు ప్రహ్లాదచారి, ఉప సర్పంచ్ తిక్కయ్య పాల్గొన్నారు.



పాఠశాల రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

నేడు బాపులదొడ్డిలో

మంత్రాలయం : పెద్దకడబూరు మండలం బాపులదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం పర్యటించనున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లనున్నారు. మూడేళ్ల పాలనలో ప్రభుత్వం తరపున లబ్ధిదారులకు అందిన సంక్షేమ ఫలాలు, గ్రామంలో చేపట్టిన ప్రగతి పనులు వివరించనున్నారు. అలాగే పర్యటన అనంతరం చేపట్టే పనులను గ్రామస్తుల దృష్టికి తీసుకోపోనున్నారు.

జాతీయ యువజనోత్సవాలకు ఆదోని విద్యార్థిని

ఆదోని అర్బన్ : కర్ణాటకలోని హుబ్లీ దారువాడలో నేటి నుంచి జరిగే జాతీయ యువజనోత్సవాలకు ఆదోని ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎస్.ఉషారాణి ఎంపికైంది. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాల కరస్పాండెంట్ దైవదీనంరెడ్డి , ప్రిన్సిపాల్ మోహన్ ఆ విద్యార్థిని కాలేజీలో ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ యువజనోత్సవాలకు రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధి నుంచి ఇద్దరిని ఎంపిక చేశారని, అందులో తమ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విట్టా సతీష్, యాజమాన్య సభ్యులు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

ఆదోని అర్బన్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మున్సిపల్ పాఠశాలల హెచ్‌ఎంలు మల్లికార్జున, అలీంసిద్దిఖీ అన్నారు. స్థానిక మున్సిపల్ పాఠశాలల్లో ఎంటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను బాగా చదివి పరీక్షల్లో ప్రతిభ చూపాలన్నారు. దీనివల్ల ఏటా రూ.12 వేలు చొప్పున ఆరు సంవత్సరాల వరకు స్కాలర్‌షిప్ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కోటన్న, బసవరాజు, చంద్రమౌళి, శర్మ, ప్రతాపరెడ్డి, నూర్‌హుల్‌హక్, అంతుల్, స్వాతి, వెంకటేశ్వర్లు, రమేష్‌రావు, సుధాకర్, మహేష్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంటీఎఫ్ నాయకులు

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కోసిగి: పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, అదిశగా విద్యార్థులను సిద్ధం చేయాలని సర్వశిక్ష అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి వేణుగోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రేరణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నాయని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పాఠ్యాంశాలను ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పది పరీక్షలకు సన్నద్ధంపై ఈనెల 20వ తేదీన జిల్లాలోని ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తర్వాత మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వడ్డించాలని సూచించారు. అంతకు ముందు ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం తాలూకా అధ్యక్షుడు వీరేష్ ఆయనను కలిసి కోసిగిలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు.



అడిషనల్ పీడీ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సర్వేతో భూ వివాదాలు పరిష్కారం

కోసిగి: ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భూ వివాదాలకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం ద్వారా పరిష్కారం లభిస్తుందని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం కోసిగి మండలంలోని పల్లెపాడు, సజ్జలగుడ్డం గ్రామాల్లో తహసీల్దార్ రుద్రగౌడ రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములు సర్వేకు నోచుకోక రైతులు ఇబ్బంది పడేవారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఊరూరా ఉచితంగా సర్వే చేస్తుండటంతో చాలా మందికి మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం పల్లెపాడు గ్రామంలో 401 మందికి, సజ్జలగుడ్డం గ్రామంలో 112 మందికి భూహక్కు పత్రాలు మంజూరు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అలాగే మండలంలోని కలువలగుండు, పుట్టకుంట, యండపల్లి, పెండేకల్లు పొలాలకు సంబంధించి రీసర్వే పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీపీ ఈరన్న, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన గౌడ, గ్రామ నాయకులు లంకా రెడ్డి, నరసింహులు, రామాంజినేయులు, నరసయ్య, ఆర్‌ఐ తిక్కస్వామి, వీఆర్వో ఏసుదాసు పాల్గొన్నారు.



రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పార్టీలకు అతీతంగా పోరాటాలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆదోని అర్బన్: విద్యార్థుల సమస్యలపై పార్టీలకు అతీతంగా కలిసి పోరాడాలని బీసీ నాయకులు అన్నారు. పట్టణంలోని బీసీ హాస్టల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సంఘం, జాతీయ బీసీ విద్యార్థి సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం వారు ఆవిష్కరించారు. బీసీ కులసంఘం జిల్లా అధ్యక్షుడు దేవేంద్రప్ప, బీసీ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, మాదాసి, మాదారి కురువ సంఘం గౌరవాధ్యక్షులు మోహన్ ప్రసాద్, పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్, నాయకులు బసవరాజ్, నీలకంఠప్ప, హుసేనప్ప, మురళీ, మల్లికార్జున పాల్గొని మాట్లాడారు. బీసీలంతా ఐక్యమత్యంగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హరికృష్ణ, గోవిందు, మల్లేశ్వర్‌రావు, భానుప్రకాష్, పరమేష్, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి

ఆదోని అర్బన్ : అఖిలభారత వడ్డె ఓబన్న సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, బీజేపీ సీనియర్ నాయకులు బద్రీనారాయణప్ప, బీసీ సంఘం నాయకులు దస్తగిరినాయుడు, చెన్నబసప్ప పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డెరజాతి ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో సమానంగా బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ నాయకులు మలేకర్ శ్రీనివాస్, మహాదేవ్, బాలాజీ, మోహన్, గోపీ, ఈరన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సేవాసమితి సభ్యులు

సీజనల్ వసతిగృహం ప్రారంభం

ఆదోని అర్బన్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో విశాల పాదుపుగ్రూపు ఆధ్వర్యంలో సీజనల్ వసతిగృహం ఏర్పాటైంది. దీనిని కి పెద్దతుంబళం జెడ్పీహెచ్ ఎస్ పాఠశాల హెచ్‌ఎం రంగప్ప రిబ్బన్ కట్ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకుదెరువు కోసం తల్లిదండ్రులు వలస వెళ్తుంటారన్నారు. అలాంటి వారి పిల్లల కోసం విశాల పాదుపు గ్రూపు ఈ హాస్టల్ ఏర్పాటు చేసిందన్నారు. కార్య క్రమంలో స్థానిక పాఠశాలల హెచ్‌ఎం గౌస్, బస ప్ప, దాసన్న, ఉపాధ్యాయులు నరసింహులు, ఆంజనేయ, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



వసతిగృహంలో ఉన్న పిల్లలు

ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు

- మునిసిపల్ సిబ్బందికి కమిషనర్ ఆదేశం

ఆదోని అర్బన్ : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా అవసరమైన పనులు వేగంగా చేపట్టాలని మునిసిపల్ సిబ్బందిని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు.రోజూ మాదిరిగానే పట్టణంలో డ్రెయినేజీ, రహదారి పనులను పరిశీలించారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని ఆదేశించారు. తర్వాత రాంజలలోని ఫిల్టర్‌బెడ్ పంపుసెట్‌లను తనిఖీ చేశారు. పైపులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు విడుదల చేయాలని ఆదేశించారు. పట్టణంలోని 16, 18, 19 వార్డు సచివాలయాలను సందర్శించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఉద్యోగులకు సూచించారు. అంతకు ముందు కాంపోస్టు యార్డును సందర్శించి కొత్తగా వచ్చిన ఎకోబిన్ మిషన్‌ను ట్రయల్ రన్ నిర్వహించారు.



ఓవర్ బ్రిడ్జి కింద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

కోలుకోలేక యువకుడి మృతి

ఆలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కోలుకోలేక మృతి చెందాడు. వివరాలు.. ఆలూరుకు చెందిన ఖాసీం బాషా (28) ఓ కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి పార్సిల్ ఇవ్వడానికి వెళ్తుండగా.. ఆలూరు సమీపంలోని హైవే–167లో మారెమ్మ దేవాలయం వద్ద ట్రాక్టర్ (ఏపీ 21 టీజెడ్ 7618) పొలాల రస్తా నుంచి మట్టిలోడుతో హైవేపైకి వస్తూ స్కూటర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఖాసీం బాషా మూడు రోజులుగా బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఖాసీం బాషాకు భార్య మెహరూన్, రెండు నెలల వయసున్న కూతురు ఉంది.

మద్యం మత్తులో బావిలో పడి..

మద్దికెర: స్థానిక కొండమ్మ బావిలో మద్యం మత్తులో పడి రామాంజులు (45) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జెండా కట్ట వీధిలో తల్లి పాపక్క, రామాంజులు నివాసం ఉంటున్నారు. రామాంజులు ప్రతిరోజు బావిలో స్నానం చేసేందుకు వస్తుంటాడని, మద్యం మత్తు ఉండడంతో కాలు జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.